# ఫిలిప్పీయులకు వ్రాసిన పత్రి క 4వ అద్యాయము

### హెచ్చరికలు

కావున నేనపేక్షించు నా ప్రియ సహోదరులారా, నా ఆనందమును, నా కిరీటమునై యున్న నా
ప్రియులారా, ఇట్లు ప్రభువునందు స్థిరులై యుండుడు 2 ప్రభువు నందు ఏక మనస్సుగలు వారై యుండుడని
యువొదియను, సుంటుకేను బతిమాలు కొనుచున్నాను. 3 అవును, నిజమైన సహకారీ ఆ స్త్రీలు క్లెమెంతుతోను
నా ఇతర సహకారులతోను సువార్తపనిలో నాతో కూడా ప్రయాస పడినవారు గనుక వారికి సహాయము
చేయుమని నిన్ను వేడుకొనుచున్నాను. ఆ సహకారుల పేర్లు జీవగ్రంథమందు వ్రాయబడియున్నవి. 4
ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడు మరల చెప్పుదును ఆనందించుడు 5 మీ మృదుత్వమును,
సహనమును సకలజనులకు తెలియబడనియ్యుడు ప్రభువు సమీపముగా ఉన్నాడు. 6 దేనిని గూర్చియు
చింతపడకుడు గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనల చేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు
దేవునికి తెలియజేయుడు 7 అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ
హృదయములకును మీ తలంపులకును కావలి యుండును. 8 మెట్టుకు సహోదరులారా, ఏ యోగ్యతయైనను
మెప్పైనను ఉండిన యెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో,
ఏవి రమ్య మైనవో, ఏవి ఖ్యాతిగలవో వాటి మీద ధ్యానముంచుకొనుడు 9 మరియు మీరు నావలన ఏమి
నేర్చుకొని అంగీకరించితిరో నాయందున్నట్టుగా ఏవి వింటిరో ఏవి చూచితిరో, అట్టి వాటిని చేయుడు అప్పుడు
సమాధాన కర్తయగు దేవుడు మీకు తోడైయుండును.

### ఫిలిప్పీయులు చూపిన ఆదరణకై పౌలు కృతజ్ఞత

10 నన్ను గూర్చి మీరిన్నాళ్లకు మరల యోచన చేయసాగితిరని ప్రభువునందు మిక్కిలి
సంతోషించితిని. ఆ విషయములో మీరు యోచన చేసి యుంటిరి గాని తగిన సమయము దొరకకపోయెను.
11 నాకు కొదువ కలిగినందున నేనీలాగు చెప్పుటలేదు నేనే స్థితిలోఉన్నను ఆ స్థితిలో సంతృప్తి గలిగి యుండ
నేర్చుకొని యున్నాను. 12 దీన స్థితిలో ఉండ నెరుగుదును, సంపన్నస్థితిలో ఉండ నెరుగుదును ప్రతి
విషయములోను అన్ని కార్యములలోను కడుపు నిండియుండుటకును, ఆకలిగొని యుండుటకును, సమృద్ధి
కలిగి యుండుటకును, లేమిలో ఉండుటకును నేర్చుకొని యున్నాను. 13 నన్ను బలపర్చువాని యందే నేను
సమస్తమును చేయగలను. 14 అయినను నా శ్రమలో మీరు పాలు పుచ్చుకొనినది మంచి పని. 15
ఫిలిప్పీయులారా, సువార్తను నేను బోధింపనారంభించి మాసిదోనియలో నుండి వచ్చినప్పుడు, ఇచ్చు
విషయములోను, పుచ్చుకొను విషయములోను మీరు తప్ప మరి ఏ సంఘము వారును నాతో పాలివారు
కాలేదని మీకే తెలియును. 16 ఏలయనగా థెస్సలొనీకలో కూడా మీరు మాటి మాటికి నా అవసరము
తీర్చుటకు సహాయము చేసితిరి. 17 నేను ఈవిని అపేక్షించి ఈలాగు చెప్పుట లేదు గాని మీ లెక్కకు విస్తార
ఫలము రావలెనని అపేక్షించి చెప్పుచున్నాను. 18 నాకు సమస్తమును సమృద్ధిగా కలిగియున్నది. మీరు పంపిన
వస్తువులు ఎపఫ్రొదితు వలన పుచ్చుకొని ఏమియు కొదువ లేకయున్నాను. అవి మనోహరమైన సువాసనయు
దేవునికి ప్రీతికరమును ఇష్టమునైన యాగమునై యున్నవి. 19 కాగా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున
క్రీస్తుయేసు నందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును.

## ముగింపు మాటలు

20 మన తండ్రియైన దేవునికి యుగ యుగములకు మహిమ కలుగును గాక ! ఆమేన్. 21 ప్రతి పరిశుద్ధునికి క్రీస్తుయేసు నందు వందనములు చెప్పుడి 22 నాతో కూడా నున్న సహోదరులందరును మీకు వందనములు చెప్పుచున్నారు. పరిశుద్ధులందరును ముఖ్యముగా కైసరు ఇంటివారిలో ఉన్న పరిశుద్ధులును మీకు వందనములు చెప్పుచున్నారు. 23 ప్రభువైన యేసుక్రీస్తు కృప మీ ఆత్మతో ఉండును గాక.